దులో ఒక చిన్న గది. తలుపు తెరిస్తే రోడ్డుమీద వున్నట్టే.... నిరంతరం పక్కవాటాల్లోనివారి గొడవలు.... పక్కభాగంలో అద్దెకుంటున్న రైల్వే క్లర్కు భార్యకు ఏదో జబ్బు.... ఆమె ఇరవై నాలుగ్గంటలూ మంచంలోనే వుంటుంది. ఆయన పెద్ద కూతురు ఫిఫ్తుఫారంతప్పి ఇంట్లో కూర్చున్నది. ఎప్పుడూ వీధి గుమ్మంలో నిలబడి వచ్చేపోయే వారిని చూస్తూ వుంటుంది. మొన్న ఎవడో పోకిరీ వెధవ వీధిలోపోతూ ఆమెవంక చూసి ఈల వేశాట్ట ....దాని మీద పెద్ద రాద్ధాంతం.... ఆమె అన్న ఒకడున్నాడు. వాడూతనలాగే కాలేజిలో చదువుకున్నన్నాళ్లూ 'బి.ఏ. ప్యాసవడం ఎలాగా?' అని తప్ప మరోటి ఆలోచించలేదు. బుర్ర బద్దలు కొట్టుకుని రాత్రీ పగలూ ప్రతి నిముషమూ ఒకటే చదువు .... చివరి పరీక్షవ్రాసి జ్వరం పడ్డాడు. తర్వాత పరీక్షప్యాసై కొన్నాళ్ళపాటు సంతోషించాడు. అప్పుడు అసలు కథ ప్రారంభమైంది. సంవత్సరం నుంచీ వాడు ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. అడ్డమైన చోట్లకూ అప్లయి చేశాడు. రికమెండేషన్ల కోసం అడ్డమైన వారి కాళ్ళు పట్టుకున్నాడు. ఇంకా ఇప్పటికీ అలా చేస్తూనే వున్నాడు.... ఇక ఆ రైల్వే గుమాస్తా సంగతి.... అతడు ప్రతిరోజూ రాత్రిపూట బాగా అలిసి పోయి తోటకూర కాడలా తూలిపోతూ ఇంటికి వస్తాడు. వచ్చీ రావడంతోనే గొడవ మొదలు.... అందరిమీదా విసుక్కుంటాడు. 'నేనొక్కణ్ణీ రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడుతూవుంటే ఊరికే కూర్చుని తినేందుకు సిగ్గులేదూ మీకు?' అంటాడు. అప్పుడు అతని ముసలితల్లి అందుకుంటుంది. పాపం, ఆమెకు జీవితమంతా చాకిరీతోనే సరిపోయింది. ఆమె కొడుకు మాటలువిని గొణుగుతూ 'నన్ను గురించే కదురా నువ్వనేది? అయిపోయింది నాయనా? కాటికి కాళ్లు చాచుకుని వున్నాను. కొద్ది రోజులాగు. నా పీడ విరగడవుతుంది' అంటూ వుంటుంది. దానితో 'నిన్నె వరన్నారమ్మా? వెధవ సొద.... అక్కడ పగలల్లా గొడ్డు చాకిరీ.... ఇంట్లో ఈ గోల....' అంటూ ఆయన కేకలు వెయ్యడం....

పని చెయ్యరు గనుక? హోదా వుంది. పలుకుబడి వుంది. పెద్దజీతంవుంది. పోష్టుమాష్టర్ల దగ్గరనించీ స్టేషను మాష్టర్లవరకూ అందరూ మీస్నేహితులే కదా! మీకేం తక్కువ?'

'అవుననుకోండి. కాని చెప్పానుగా.... ఈ ఆడంబరాలంటే నాకాట్టే ఇష్టం ఉండదని....'

"అలా అంటే నేనొప్పుకోను. పుట్టినరోజు పండుగచేసుకునేందుకు యిష్టం లేక పోవట మేమిటి? ఇప్పుడా కుర్రవాణ్ణే తీసుకోండి. అదే, మా నాన్నగారి దగ్గరకు వచ్చి ప్రాధేయపడ్డాడే.... అతని చెల్లెలు పుట్టినరోజు అనుకుందాము. పాపం? వాళ్ళేం చెయ్యగలరు చెప్పండి. ఒక చీరముక్క కూడా కొనిపెట్టలేరు అటువంటివాళ్ళు. 'ఓహో! అన్నట్టు మాచెల్లి ఇవాళే పుట్టింది....' అనుకుని ఊరుకుంటారు. కాని మీ విషయం అలాకాదే. ఇవాళే పెరిలిన్ చీరె కొనేందుకు బయల్దేరారు దానికే వందరూపాయలు ఖర్చుకదా! ఇక ఇంట్లో ఎంత లేదనుకున్నా పదిపదిహేనుమందికి – ఆపిల్ల స్నేహితురాళ్ళకయినా విందుచేస్తారు. ఎంత చెట్టుకు అంతగాలి. ఏమంటారు?"

శంకరం నవ్వాడు. 'మీరలా చెబుతుంటే నేనింకేమనగలను? అవునంటాను.' అన్నాడు.

'అలా దారికి రండి. అన్నట్టు మీరు పిలవకపోయినా రేపు నేనూ వొస్తాను మీయింటికి. మీచెల్లెల్ని చూడాలి. ఆ అమ్మాయి ఏం చదువుకుంటేమిటి?'

శంకరం ఎటోచూస్తూ ఆ ప్రశ్న వినిపించుకోలేదు.

ఆమె మళ్ళీ "ఏమండీ! మిమ్మల్నే.... ఏమిటలా ఆలోచనలోపడ్డారు? నేనడిగేది వినిపించిందా?' అని అడిగింది.

